
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 7 । నవంబర్ । 2023



సోమశిలలో 29.920 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 29.220 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 47 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు(10 గ్రాములు)	రూ.62.900
22 క్యారెట్లు ఆర్నమెంటు(1గ్రా)	రూ.5,649
3శాతం జీఎస్టీతో	రూ.5,818
సవర(8గ్రాములు)	రూ.46,544

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.4 /25.0

సోమవారం గాలిలో తేమ 80 శాతం ఉంది. జిల్లాలో పలుచోట్ల వర్షం కురిసింది. మంగళవారం కూడా జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

కూరగాయల సాగులో ఏటీఎం మోడల్



కూరగాయ పంటల సాగులో వ్యవసాయ శాఖ వినూత్న పద్ధతికి శ్రీకారం చుట్టింది. తక్కువ విస్తీర్ణంలో ఒకేసారి వివిధ రకాల కూరగాయ పంటలను సాగు చేయించడం ద్వారా రైతులకు నిత్యం ఆదాయం వచ్చే ప్రణాళికలను అమలు చేస్తోంది. కూరగాయ పంటల సాగులో ప్రతి రోజూ ఆదాయం వచ్చే 'ఎనీ టైమ్ మనీ' (ఏటీఎం) మోడల్‌ను ప్రస్తుతం అమలు చేస్తున్నారు. ఈ విధానంలో నిరంతరం రైతు ఏదో ఒక పంటను మార్కెట్‌లో విక్రయించుకుని ఆదాయం పొందే అవకాశం ఉంటుందని ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రకృతి వ్యవసాయ సాగులో వినూత్న పద్ధతి

- రైతులకు నిత్యం ఆదాయం వచ్చేలా ప్రణాళిక
- జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న రైతులు



సాగులో ఉన్న వంగతోట

కందుకూరు: తక్కువ విస్తీర్ణంలో, తక్కువ ఖర్చుతో కూరగాయల పంటల సాగు చేపట్టి రైతులకు ఏడాది పొడవునా ఆదాయం సమకూర్చే విధానమే ఏటీఎం మోడల్. రైతులు పొలంలో ఒకే రకం కూరగాయలు సాగు చేయడం ఆనవాయితీ. అయితే ఏటీఎం మోడల్‌లో అలా కాకుండా కేవలం 0.25 సెంట్ల పొలంలో 10 నుంచి 20 రకాల కూరగాయలను సాగు చేయడం ఈ విధానం ప్రత్యేకత. చిన్న, సన్నకారు రైతులను దృష్టిలో ఉంచుకుని ఈ విధానాన్ని ప్రకృతి వ్యవసాయశాఖ రూపకల్పన చేసింది. 20 రకాల కూరగాయల సాగును ఒకేసారి చేయడం వల్ల అవి వివిధ దశల్లో పంట చేతికొచ్చి అన్ని కాలాల్లోనూ ఆదాయాన్ని సమకూర్చుతాయని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రైతులతో ఈ విధానంలో కూరగాయ పంటలను సాగు చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఉదాహరణకు కందుకూరు ప్రాంతంలో కందుకూరు మండలంలోని ఓగూరు, వెంకటాద్రిపాళెం గ్రామాల్లో, వలేటివారిపాళెం అమ్మపాళెంలో, గుడ్లూరు మండలంలోని పాజర్ల, ఉలవపాడు మండలంలోని మన్నేటికోట, కరేడు గ్రామాల్లో ప్రస్తుతం ఈ విధానంలో కూరగాయల పంటలను రైతులు సాగు చేశారు.



నిత్యం రైతులకు ఆదాయం

రైతుకు ఏడాదంతా ఆదాయం వచ్చేలా ఒక ప్రధాన పంట, అందులో అంతర పంటల కింద కూరగాయలు సాగు చేస్తారు. దీనిలో ఏ రకం కూరగాయ పంటలు సాగు చేయాలనేది రైతుల ఇష్టం. గడ్డ జాతి, తీగజాతి, ఆకుకూరలు ఇలా అన్ని రకాల పంటలను సాగు చేస్తున్నారు. ఓగూరులో సాగు చేసిన పొలంలో నిమ్మను ప్రధాన పంట కింద సాగు చేయగా, దీనిలో అంతర పంటలుగా టమాటా, గోరుచిక్కుడు, వంగ, బెండ వంటి పంటలు వేశారు. అలాగే గడ్డజాతి కింద క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి పంటలు, ఆకుకూరల్లో గోంగూర, తోటకూర, చుక్కకూర, పాలకూర వంటివి సాగు చేస్తున్నారు. ఇక పొలం చుట్టూ తీగజాతులైన బీర, కాకర, సొరకాయ, దొండ, దోస వంటి కూరగాయలు సాగు చేస్తున్నారు. అలాగే తెగుళ్లు ఆశించకుండా ఉండేందుకు ఆముదం, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేస్తున్నారు. ఇలా సాగు చేయడం వల్ల ఏడాది పొడవునా వివిధ దశల్లో కూరగాయలు రైతుల చేతికొస్తాయి. వాటిని మార్కెట్‌లో విక్రయించి ఆదాయం పొందవచ్చు.

రసాయనిక ఎరువులు లేకుండా..

ఈ విధానం పూర్తిగా ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతుల్లోనే చేయిస్తున్నారు. దీని వల్ల రైతులకు సాగు ఖర్చు తగ్గుతుందని, మేలు రకం ఉత్పత్తులు దిగుబడి అవుతాయని చెబుతున్నారు. రసాయనిక ఎరువులకు బదులు ఘన, ద్రవ జీవామృతాలు స్ప్రే చేస్తున్నారు. పూత బాగా వచ్చేందుకు పుల్లటి మజ్జిగను, మొక్కలు ఏపుగా పెరిగేందుకు చేపల వ్యర్థాలు, బెల్లం మిశ్రమాన్ని పొలానికి వేస్తున్నారు. దీని వల్ల ఓ వైపు పొలం సారవంతం కావడంతో పాటు పంట మార్పిడి విధానానికి అనుకూలంగా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.



జీవామృతం పిచికారీ చేస్తున్న రైతు (ఫైల్)

నిరంతరం ఆదాయం

కూరగాయ పంటలు సాగు చేసే రైతులకు నిత్యం ఆదాయం వచ్చేలా చేయాలన్నదే ఈ ఏటీఎం మోడల్ ఉద్దేశం. ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతుల్లో ఈ విధానాన్ని ప్రోత్సహించేందుకు క్షేత్రస్థాయిలో జెడ్‌బీఎన్‌ఎఫ్(జీరో బేస్డ్ నాచురల్ ఫార్మ్) సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సలహాలు అందిస్తారు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కువ మంది రైతులు ఈ విధానంలో కూరగాయలు సాగు చేసేలా అవగాహన కల్పిస్తున్నాం.

– మాలకొండయ్య, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్, ప్రకృతి వ్యవసాయం

రెండేళ్లుగా సేంద్రియ పద్ధతుల్లో సాగు



రెండేళ్లుగా నా పొలంలో సేంద్రియ పద్ధతిలోనే కూరగాయలు సాగు చేస్తున్నాను. ఏటీఎం మోడల్‌లో 0.30 సెంట్లలో అన్నిరకాల కూరగాయలు సాగు చేశాం. నేను సాగు చేసిన ఆకుకూరలు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి. వీటిని కందుకూరులోని రైతు బజార్‌లో మా కౌంటర్‌లో విక్రయిస్తాం.

– జిల్లెలమూడి వెంకటేశ్వర్లు, రైతు, వెంకటాద్రిపాళెం

25 సెంట్లలోనే అన్నిరకాలు



ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లోనే గత కొంతకాలంగా వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నాను. ప్రస్తుతం 0.25 సెంట్ల పొలంలోనే అన్నిరకాల కూరగాయలు సాగు చేశాను. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్నాయి. ఎలాంటి రసాయనిక ఎరువులు వాడకుండా, సేంద్రియ ఎరువులతోనే కూరగాయలు పండిస్తున్నాను. మార్కెట్‌లో కూడా వీటికి మంచి డిమాండ్ ఉంది.

– మాధవరావు, రైతు, ఓగూరు

న్యూస్‌రీల్

14న ఐఏబీ సమావేశం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం ఈ నెల 14వ తేదీన జరుగుతుందని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో డెల్టాకు సాగునీరు విడుదల చేయాలని రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ స్పందిస్తూ జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో పంటలకు సాగు నీటి విడుదలపై కమిటీ తగిన నిర్ణయం తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు.

టీటీడీ ఢిల్లీ స్థానిక సలహా మండలి ప్రెసిడెంట్‌గా ప్రశాంతిరెడ్డి



ప్రమాణ స్వీకారం చేసిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): టీటీడీ ఢిల్లీ, ఇతర ఉత్తర భారత దేవాలయాల స్థానిక సలహా మండలి ప్రెసిడెంట్‌గా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఢిల్లీలోని టీటీడీ ఆలయంలో సోమవారం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఆలయ ఈఓ ధర్మారెడ్డి సమక్షంలో మండలి సభ్యులతో కలిసి ప్రశాంతిరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. గతంలో ఒక పర్యాయం ఇదే పదవిలో కొనసాగిన ప్రశాంతిరెడ్డి, రెండోసారి ఆ పదవిని చేపట్టడం విశేషం. ఆమె టీటీడీ ఉత్తర భారత దేవాలయాల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏసీబీ తనిఖీలు

- వెలుగులోకి వస్తున్న అక్రమాలు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరులోని చంద్రమౌళినగర్‌లో ఉన్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు చేపట్టిన తనిఖీల్లో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. గడచిన నాలుగు రోజులుగా ఏసీబీ డీఎస్పీ జీఆర్‌ఆర్ మోహన్ నేతృత్వంలో ఆ శాఖ అధికారులు రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఫుడ్‌లైసెన్సులు తీసుకున్న వారు ప్రతి ఏటా లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాల్సి ఉంది. అయితే అనేక మంది లైసెన్సులను రెన్యువల్ చేసుకోకుండా నెలల తరబడి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఫుడ్ కంట్రోలర్ అధికారుల తనిఖీల్లో ఈ విషయాలు వెలుగులోకి వచ్చినప్పటికీ సదరు లైసెన్స్‌లకు సంబంధించి చర్యలు తీసుకోకపోగా పాత వాటిని రద్దు చేసి కొత్త లైసెన్సులు ఇచ్చారు. సాధారణంగా లైసెన్స్ కాలపరిమితి తీరిపోయిన అనంతరం ఎన్ని నెలల రెన్యువల్ చేసుకోకపోతే లైసెన్స్ ఫీ మూడు రెట్లు అధికంగా చెల్లించి రెన్యువల్ చేసుకోవాల్సి ఉంది. అలాకాకుండా కొత్త లైసెన్సులు ఇవ్వడం ద్వారా సుమారు రూ.కోటిన్నరకు పైగా ప్రభుత్వాదాయానికి గండిపడినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. దీంతోపాటు ప్రతి ఏటా ఆడిట్ చేసి ఐటీ రిటర్న్స్ దాఖలు చేయాల్సి ఉంది. ఆడిటర్ల ప్రమేయంతో ఇందులోనూ అక్రమాలు జరిగినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. వారిని సైతం విచారించనున్నట్లు తెలిసింది.

30 లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

నెల్లూరు(టౌన్): ఇంటర్మీడియట్ 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు ఈ నెల 30వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని ఆర్‌ఐఓ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1,000 అపరాధ రుసుంతో వచ్చే నెల 15వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. ప్రథమ సంవత్సర రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థులు రూ.550 ఫీజు చెల్లించాలని, ఒకేషనల్ విద్యార్థులు ప్రాక్టికల్స్ కోసం అదనంగా రూ.250 చెల్లించాలని తెలిపారు. ద్వితీయ సంవత్సర రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థులు రూ.550 పరీక్ష ఫీజు చెల్లించాలని, ప్రాక్టికల్స్ పరీక్షలకు రూ.250 ఫీజు చెల్లించాల్సి ఉందని తెలిపారు. 2024 మార్చిలో జరిగే ఇంటర్ మూల్యాంకనం కోసం జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల వివరాలను జ్ఞానభూమి వెబ్‌సైట్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా సంబంధిత కళాశాలల ప్రిన్సిపల్స్ ఈ నెల 30వ తేదీలోపు నమోదు చేయాలని తెలిపారు. నమోదు చేసుకున్న అధ్యాపకుని మూలాంకనానికి పంపకపోతే ఒక అధ్యాపకునికి రోజుకు రూ.1,000 చొప్పున జరిమానా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

జగన్ హయాంలోనే జనరంజక పాలన

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- ప్రజాసంకల్పయాత్ర చేపట్టి ఆరేళ్లయిన సందర్భంగా సంబరాలు



ప్రజాసంకల్పయాత్ర సంబరాల్లో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, మేయర్ స్రవంతి తదితరులు

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నివర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్ర చేపట్టి 6 సంవత్సరాలు అయిన సందర్భంగా సోమవారం నెల్లూరు నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కాకాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సూచనలతో ఈ సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ చేసిన పాదయాత్ర చంద్రబాబును మట్టికరిపించి ముఖ్యమంత్రి అయ్యేందుకు దోహదపడిందన్నారు. చంద్రబాబు వైఎస్సార్ పాదయాత్రను కాపీ కొట్టి, ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేశారని గుర్తుచేశారు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చాక నెరవేర్చారని తెలిపారు. తాజాగా జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇస్తామన్న హామీని కూడా నెరవేర్చేలా కేబినెట్‌లో ఆమోదించినట్లు తెలిపారు. ప్రజలందరి అభిమానాన్ని చూరగొన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జనం ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయన్నారు.

మేనిఫెస్టోను పూర్తిగా అమలు చేసిన ఏకైక సీఎం

ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాసంకల్పయాత్ర సంబరాలు జరుపుకోవడం సంతోషంగా ఉందని, దేశంలోనే మేనిఫెస్టోలోని అంశాలను పూర్తిగా అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తోందన్నారు. నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి మాట్లాడుతూ జగనన్న అంటే పేదలకు భరోసా అని, రానున్న ఎన్నికల్లో అందరూ జగనన్నకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని ప్రజలు నేటికీ ఆరాధిస్తున్నారని, అంతకు మించి జగనన్నను అభిమానిస్తున్నారని తెలిపారు. 3,648 కిలోమీటర్ల జగనన్న పాదయాత్రలో ఎక్కడ చూసినా జన ప్రభంజనమే అని గుర్తుచేశారు. పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్నను మరలా ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పేర్నాటి కోటేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి, నాయకులు మందల వెంకటశేషయ్య, హరిబాబుయాదవ్, జి.ప్రసాద్, మల్లు సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు తలమంచి సురేంద్రబాబు, ముత్యంగౌడ్, నారాయణబాబు, మండల కన్వీనర్లు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు



అండర్-14 విభాగంలో విజేతగా నిలిచిన శ్రీకాకుళం జట్టు

ఆత్మకూరు: రాష్ట్రస్థాయి 67వ ఎస్‌జీఎఫ్ బాలికల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ముగిశాయి. గత మూడు రోజులుగా రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాలకు చెందిన అండర్-14, 17, 19 బాలికల జట్లు ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన ఈ పోటీల్లో పాల్గొన్నాయి. అండర్-14 విభాగంలో శ్రీకాకుళం జిల్లా జట్టు తూర్పుగోదావరి జిల్లా జట్టుపై విజయం సాధించింది. అండర్-17 విభాగంలో గుంటూరు జిల్లా జట్టు తూర్పుగోదావరి జిల్లా జట్టుపై విజయం సాధించింది. అండర్-19 విభాగంలో విశాఖపట్నం జిల్లా బాలికల జట్టు శ్రీకాకుళం జిల్లా జట్టుపై ఘన విజయం సాధించింది. విజేతగా నిలిచిన మూడు జట్లకు రూ.70 వేల చొప్పున, రన్నర్లుగా నిలిచిన మూడు జట్లకు రూ.30 వేల చొప్పున ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నగదు బహుమతులు అందజేశారు. అలాగే జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం అనంతలక్ష్మి, పీడీలు తిరుపతయ్య, సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం లక్ష్యాలను సాధించాలి

- కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(పొగతోట): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల లక్ష్యాలను వంద శాతం సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జెడ్పీ కార్యాలయంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మహిళల ఆరోగ్యం, పిల్లల సంక్షేమం, విద్య, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సరఫరా, గ్రాస్ ఎన్‌రోల్మెంట్ రేషియో వంద శాతం అమలు, వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర, నాడు-నేడు పనులు, జగనన్నకు చెబుదాం, రీసర్వే, హౌసింగ్ నిర్మాణాలు, జలజీవన్ మిషన్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ నెల 15వ తేదీ నుంచి భూ పంపిణీ ఉన్నందున దానికి సంబంధించిన డేటాను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో జేసీ ఆర్.కూర్మనాథ్, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుధాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- కలెక్టర్ ఎం.హరినారాయణన్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ప్రజలు అందజేసిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డిలతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందేలా వారి సమస్యలకు పరిష్కారం చూపాలని, ప్రజలు అందించిన అర్జీలను నిబంధనల మేరకు నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సుందరయ్యయాదవ్, లైబ్రరీ సెక్రటరీ స్వర్ణప్రసాద్ కోర్ట్ ఫీ స్టాంప్‌లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుధాకర్‌రాజు, నీటిపారుదలశాఖ ఎస్ఈ కృష్ణమోహన్, జిల్లా సర్వే అధికారి హనుమాన్ ప్రసాద్, మెప్మా పీడీ రవీంద్ర, హౌసింగ్ పీడీ నాగరాజు, డీఈఓ గంగాభవాని, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ బాలాంజనేయులు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారులు దరఖాస్తులు ఆహ్వానించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 147 వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, నోటిఫికేషన్ ఇచ్చే నాటికి ఉన్న ఖాళీలను దృష్టిలో పెట్టుకుని భర్తీ చేస్తామని తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి 10వ తరగతి ఉత్తీర్ణులై వారు అర్హులని తెలిపారు. మంగళవారం నుంచి 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరిస్తారని, 9న దరఖాస్తుల పరిశీలన, 10న ఇంటర్వ్యూల నిర్వహణ పూర్తి చేసి ఎంపికైన వారికి 13వ తేదీన నియామక పత్రాలు అందజేయాలని తెలిపారు.

అంతులేని సుధీర్ గ్యాంగ్ మోసాలు

- ఒక్కొక్కటిగా వెలుగులోకి..
- స్పందనలో ఫిర్యాదుల పరంపర


ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

నెల్లూరు(క్రైమ్): కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి ఘటనలో ప్రధాన నిందితుడు దేవరకొండ సుధీర్ అలియాస్ అజయ్‌రెడ్డి, అతని గ్యాంగ్ మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తక్కువ ధరకే బంగారం, భూములు, రెట్టింపు నగదు పేరుతో మోసాలు, బెదిరింపులపై ఫిర్యాదులు అందుతున్నాయి. గత నెల 30వ తేదీన గుంటూరు, విజయవాడ, జిల్లాలోని ముత్తుకూరు మండలానికి చెందిన ముగ్గురు బాధితులు స్పందన కార్యక్రమంలో సుధీర్ మోసాలపై ఫిర్యాదులు చేశారు. తాజాగా భీమవరానికి చెందిన కే నారాయణదాస్, గుంటూరు జిల్లా తెనాలి మండలానికి చెందిన ఏ సుధీర్, అదే జిల్లాకు చెందిన పీ నరసింహులు, విజయలక్ష్మి, తెలంగాణ రాష్ట్రం జగిత్యాలకు చెందిన రాజేష్ స్పందనలో సుధీర్.. అతని గ్యాంగ్ మోసాలపై ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు.

చంపుతామని బెదిరింపులు

భీమవరానికి చెందిన కె.నారాయణదాస్, వీఎస్ఎస్ సుధీర్ వ్యవసాయం చేసేందుకు తక్కువ ధరలో పొలం కోసం వెతుకుతుండగా బ్రోకర్ ద్వారా దేవరకొండ సుధీర్ పరిచయమయ్యాడు. తనకు తెలిసిన రైతుల వద్ద 70 ఎకరాల పొలం ఉందని, ఎకరం రూ.3 లక్షలకు ఇస్తానని సుధీర్ వారిని నమ్మించాడు. అతని మాటలు నమ్మిన నారాయణదాస్, సుధీర్ పొలం కోసం రూ.96 లక్షలు ఇచ్చారు. నెల రోజుల తర్వాత పొలం అమ్మేందుకు రైతులు నిరాకరించారని సుధీర్ చెప్పాడు. దీంతో తాము ఇచ్చిన నగదు ఇవ్వాలని సుధీర్‌ను కోరగా రూ.2 వేల నోట్లు ఇస్తాం పది రోజుల తర్వాత రండి అని చెప్పాడు. వారు పది రోజుల తర్వాత కావలిలోని సుధీర్ ఇంటికి వెళ్లి డబ్బులు అడుగగా, తనను డబ్బులు అడిగినా, పోలీసుల వద్దకు వెళ్లినా చంపుతానని బెదిరిస్తున్నాడని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

పోలీసుల అవతారమెత్తి..

గుంటూరు జిల్లా తెనాలి మండలానికి చెందిన ఎ.సుధీర్‌కు మొహ్మద్ జియావుల్ హక్‌తో పరిచయమై అది కాస్తా స్నేహంగా మారింది. సుధీర్ బంగారు చైన్ చేయించుకోవాలని తెలుపగా కావలిలో బంగారం తక్కువకు వస్తుందని కిషోర్ అలియాస్ మహేంద్రరెడ్డిని పరిచయం చేశాడు. మహేంద్రరెడ్డి తమ వద్ద 100 గ్రాముల బంగారం బిస్కెట్లు ఉన్నాయని, చెన్నై వస్తే ఇస్తామని తెలపడంతో సుధీర్ చెన్నైకు వెళ్లాడు. 150 గ్రాముల బంగారు బిస్కెట్ అని ఇవ్వగా, దానిని పరిశీలిస్తే 60 గ్రాములని తేలింది. దీనిపై సుధీర్ ప్రశ్నించగా త్వరలో ఇచ్చే బంగారంతో 90 గ్రాములు కలిపి ఇస్తామని తెలిపాడు. దీంతో సుధీర్ రెండోసారి డబ్బులతో చెన్నైకు వెళ్లగా, మహేంద్రరెడ్డి బంగారం తన మనిషికి ఇచ్చి సుధీర్ వెంట పంపాడు. సింగరాయకొండ సమీపంలో మహేంద్రరెడ్డి అతని స్నేహితులు పోలీసుల అవతారమెత్తి బంగారం తీసుకుని వెళుతున్న వ్యక్తిని పట్టుకుని తమ వెంట తీసుకెళ్లారు. అప్పటి నుంచి మహేంద్రరెడ్డి ఫోన్ లిఫ్ట్ చేయలేదు. మొత్తం రూ.21 లక్షలు ఇవ్వాల్సి ఉండగా, కొద్దిరోజుల తర్వాత రూ.3 లక్షల విలువ చేసే బంగారం ఇచ్చి మిగిలిన డబ్బులు ఇవ్వడం లేదు.

తక్కువ ధరకే బంగారం ఇస్తామని..

గుంటూరు జిల్లాకు చెందిన నరసింహులు, విజయలక్ష్మిలను తక్కువ ధరకే బంగారం ఇస్తామని సుధీర్, ఖాజావలి నమ్మించారు. వారు తమ ఇంటిని అమ్మి రూ.30 లక్షలు నిందితులకు ఇచ్చారు. ఇంకో రూ.15 లక్షలు ఇస్తే బంగారం ఇస్తామని చెప్పడంతో ఆ డబ్బులు సైతం ఇచ్చారు. నగదు పూర్తిగా ముట్టాక బంగారం తీసుకొని వస్తుండగా పోలీసులు పట్టుకున్నారని సుధీర్, ఖాజావలి బాధితులను మోసగించారు.

బంగారం పేరిట మోసగించారు

తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లాకు చెందిన ఎ.రాజేష్‌కు ఏడాది క్రితం ఫోన్‌లో సుధీర్ పరిచయమయ్యాడు. తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని కావలికి చెందిన మనోహర్‌రెడ్డిని పరిచయం చేసి రూ.10 లక్షలు తీసుకున్నారు. చౌదరి అనే వ్యక్తి ఇంకా డబ్బులు ఎక్కువ కావాలని రూ.3.13 లక్షలు తీసుకున్నాడు. ఇప్పటి వరకు బంగారం ఇవ్వలేదు. డబ్బులు ఇవ్వమని గట్టిగా నిలదీయగా చంపేస్తానని బెదిరిస్తున్నారు. నిందితులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులంతా ఎస్పీని కోరారు.

మోసగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి


బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): తక్కువ ధరకే బంగారం, రెట్టింపు నగదు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి వంచించే మోసగాళ్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి సూచించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 98 మంది బాధితులు హాజరై తమ సమస్యలపై ఎస్పీకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం చేయాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వరకట్న వేధింపులు, అనుమానాస్పద మరణాలు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను అరెస్ట్ చేయాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని నేరానికి గురైతే వెంటనే సంబంధిత పోలీసుస్టేషన్‌లో లేదా సైబర్ సెల్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. అనంతరం ఫిర్యాదుదారులకు భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ క్రైమ్స్ ప్రసాద్, నెల్లూరు రూరల్, ఎస్సీ, ఎస్టీ సెల్, ఏఆర్ డీఎస్పీలు పీ వీరాంజనేయరెడ్డి, శ్రీనివాసరావు, గాంధీ, ఎస్‌బీ, టీడీసీ ఇన్‌స్పెక్టర్లు కే రామకృష్ణారెడ్డి, ఎం నాగేశ్వరమ్మ, పీఆర్వో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి కేజీఆర్ వాలీబాల్ కప్–2023


వాలీబాల్ పోటీల వివరాలు వెల్లడిస్తున్న ప్రజాప్రతినిధులు

ముత్తుకూరు: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ముత్తుకూరులోని ఈఆర్‌ఆర్‌ఎం క్లబ్‌లో ఈ నెల 8 నుంచి 'సౌత్ ఇండియా ఇన్విటేషనల్ మెన్ అండ్ ఉమన్ వాలీబాల్ లీగ్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ప్రజాప్రతినిధులు వెల్లడించారు. సోమవారం వారు ముత్తుకూరులో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 11వ తేదీ వరకు జరిగే వాలీబాల్ టోర్నమెంట్‌లో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 8 పురుష, 4 మహిళా జట్లు పాల్గొంటాయని వివరించారు. పురుషుల విభాగంలో ప్రథమ బహుమతి రూ.లక్ష నగదుతో పాటు మరో ఐదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. మహిళా విభాగంలో ప్రథమ బహుమతి రూ.50 వేల నగదుతో పాటు మరో మూడు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగే టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆదాల ప్రభాకరరెడ్డి, డాక్టర్ గురుమూర్తి పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీపీ గండవరం సుగుణ, ఎంపీటీసీ సభ్యుడు షేక్ నవీద్‌బాషా, పంచాయతీ కార్యదర్శి చక్రం వెంకటేశ్వర్లు, నాయకులు కే లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు కేఎన్నార్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం విజయప్రకాశ్

నెల్లూరు(టౌన్): జాతీయ స్థాయి యోగా పోటీలకు కేఎన్నార్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని ఆ స్కూల్ హెడ్‌మాస్టర్ విజయప్రకాశ్ తెలిపారు.సోమవారం బీవీనగర్‌లోని కేఎన్నార్ స్కూల్లో యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా వీరవాసంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో అండర్–14, అండర్–17 విభాగాల్లో కేఎన్నార్ విద్యార్థులు స్వర్ణ పతకాలు సాధించారని వివరించారు. ఈ నెల 22న త్రిపుర రాష్ట్ర రాజధాని అగర్తలలో జరగబోయే జాతీయస్థాయి యోగా పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు.

ప్రజాసంకల్ప యాత్ర చరిత్రాత్మకం

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర చరిత్రాత్మకమని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రను ప్రారంభించి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా బ్రాహ్మణపల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం సంబరాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకోవాలనే సంకల్పంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 341 రోజుల పాటు 3,648 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపట్టారని గుర్తుచేశారు. పాదయాత్రలో జగనన్న ఇచ్చిన భరోసాతో ఆయన్ని నమ్మి రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రిని చేసుకున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగనన్న నవరత్నాల పథకాలను అమలు చేసి ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారన్నారు. దివంగత సీఎం వైఎస్సార్‌లా ప్రతి పేదవాడి గుండెల్లో బతకాలన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమే ప్రజల సంక్షేమానికి దారి చూపిందని పేర్కొన్నారు. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో ముఖ్యమంత్రిగా కోట్లాది రూపాయలను ప్రజలకు నేరుగా అందజేసి ఆర్థికంగా ఆదుకున్నారని తెలిపారు. పేదలను ఏకం చేసే వేదికగా సామాజిక సాధికార యాత్ర సాగుతుందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ సాగుతున్న ఈ యాత్ర త్వరలోనే ఆత్మకూరు నియోజకవర్గానికి చేరుకోనుందని చెప్పారు. ఈ యాత్రలో ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలు భారీగా పాల్గొని సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలన కొనసాగేలా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, ముటుకుందు లక్ష్మిరెడ్డి, కొండారెడ్డి, మౌలాలి, చెవుల శ్రీనివాసులు, వల్లభనేని రాజేంద్రనాయుడు, రమేష్, శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

- జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వీ శ్రీనివాసులురెడ్డి


వీ శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(క్రైమ్): దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరని, అనుమతులు లేకుండా దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి (డీఎఫ్ఓ) వీ శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన నగరంలోని రైల్వే ఫీడర్స్ రోడ్డులోని తన కార్యాలయంలో 'సాక్షి'తో మాట్లాడారు. దుకాణాల ఏర్పాటుకు సంబధించి రెవెన్యూ శాఖ నుంచి వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుని అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు కావలి, కందుకూరు, ఆత్మకూరుల్లోని బాణసంచా గోదాములు నిబంధనల మేరకు ఉన్నాయా? ఫైర్ సేఫ్టీ పరికరాలు ఉన్నాయా? లైసెన్సులో పేర్కొన్న విధంగా నిర్ణీత మోతాదులోనే బాణసంచా నిల్వ చేశారా? చైనా క్రాకర్స్ ఉన్నాయా? జిలెటిన్‌స్టిక్స్ వంటి వాటిని ఏమైనా నిల్వచేశారా? ఇలా అన్నింటిని ఆయా ప్రాంతాల అగ్నిమాపక శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. బాణసంచా తయారీదారులు, విక్రయదారులు, గోదాముల నిర్వాహకులు విధిగా ఫైర్‌సేఫ్టీ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడే దుకాణాలు, గోదాములను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేయిస్తామన్నారు. కలెక్టర్, ఎస్పీ, ఆర్డీఓ అనుమతులు ఇచ్చిన ప్రాంతాల్లోనే దుకాణాలు ఏర్పాటు చేయాలని, అక్కడ మినహా ఇతర ప్రాంతాల్లో విక్రయాలు జరుపరాదన్నారు. అనుమతి లేకుండా టపాసులు తయారీ చేసినా, నిల్వ చేసినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. లైసెన్స్ దుకాణాల్లోనే బాణసంచా కొనుగోలు చేయాలని, నాటు క్రాకర్స్‌ను కొనవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దీపావళి సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కరపత్రాలను పంపిణీ చేస్తున్నామన్నారు. తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రజలు దీపావళిని జరుపుకోవాలన్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే డయల్ 101 ఫిర్యాదు చేస్తే తక్షణమే స్పందించి సహాయ చర్యలు చేపడుతామన్నారు.

నిమ్మధరలు (కిలో)

పెద్దవి: రూ. 50
సన్నవి: రూ. 20
పండ్లు: రూ. 6

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.104
లేయర్	రూ.105
బ్రాయిలర్ చికెన్:	రూ.190
స్కిన్‌లెస్ చికెన్:	రూ.210
లేయర్ చికెన్:	రూ.178

పేదల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి


కేక్ కట్ చేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వింజమూరు(ఉదయగిరి): పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ఆయన్ని మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని చాకలికొండలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. తొలుత ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రను ప్రారంభించి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సంబరాలు నిర్వహించారు. పార్టీ నేతలతో కలిసి రాజగోపాల్‌రెడ్డి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలు పేదలు, పెత్తందారులకు మధ్యన జరగనున్నాయని, అందులో పేదవాడి పక్షాన వైఎస్ జగన్ నిలువగా, పెత్తందారుల పక్షాన టీడీపీ, ఇతర మిత్రపక్షాలు ఉన్నాయన్నారు. ఇద్దరి మధ్యన తేడా గమనించి వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు మలిరెడ్డి విజయ్‌రెడ్డి, ఎంపీటీసీ డేగా వంశీ, సొసైటీ డైరెక్టర్ పోలుబోయిన వెంకటేశ్వర్లు, పార్టీ మండలాధ్యక్షుడు రేవునూరు శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు మద్దూరు బాబు, జక్కం మోహన్‌రెడ్డి, జక్కం శ్రీనివాసులురెడ్డి, సీలం తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లక్షిత కుటుంబానికి టీటీడీ చేయూత


లక్షిత తండ్రి కాకి దినేష్‌కు చెక్కు అందజేస్తున్న టీటీడీ అధికారి

కోవూరు: మండలంలోని పోతిరెడ్డిపాళెం దళితవాడకు చెందిన చిన్నారి కాకి లక్షిత కుటుంబానికి టీటీడీ అధికారులు మరో రూ.5 లక్షలు సాయాన్ని సోమవారం అందజేశారు. ఇటీవల తిరుమల దర్శనానికి నడకదారిలో కుటుంబంతో కలిసి వెళ్తున్న చిన్నారి లక్షిత పులి దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ సమయంలో చనిపోయిన చిన్నారిని తీసుకురాలేమని, చిన్నారి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డితో పాటు టీటీడీ ఈఓ, ఫారెస్ట్ అధికారులను కోరారు. ఈ మేరకు గతంలో టీటీడీ, అటవీశాఖ అధికారులు రూ.10 లక్షలు అందజేశారు. ఎమ్మెల్యే ప్రసన్న తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మరో రూ.2 లక్షలు అందజేశారు. పేద కుటుంబమైన చిన్నారి కుటుంబానికి మరో రూ.5 లక్షలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ప్రసన్న విజ్ఞప్తి చేయడంతో లక్షిత తండ్రి కాకి దినేష్‌కు టీటీడీ అధికారులు సోమవారం నగదు చెక్కు అందజేశారు. నిరుపేదలమైన తమను ఆదుకున్న ఎమ్మెల్యే ప్రసన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని లక్షిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం


ఖాజా మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యుడు

వెంకటాచలం: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ద్విచక్ర వాహనచోదకుడు దుర్మరణం పాలైన ఘటన చెముడుగుంటలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..బుజబుజనెల్లూరుకు చెందిన షేక్ ఖాజా(55) హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారి క్రాస్ చేస్తుండగా నెల్లూరు నుంచి బెంగళూరు వైపు వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఖాజాకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఖాజా కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఖాజా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు నెల్లూరులోని జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పారిస్ ఒలింపిక్స్ హాకీ క్వాలిఫయింగ్ టోర్నీ: భారత్‌కు కఠిన సవాలు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించేందుకు భారత మహిళల హాకీ జట్టు శ్రమించాల్సి ఉంటుంది. జనవరి 13 నుంచి 19 వరకు రాంచీలో జరిగే ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ-1కు సంబంధించిన వివరాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) సోమవారం విడుదల చేసింది. ప్రపంచ ఆరో ర్యాంకర్ భారత్‌తోపాటు ఈ టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్ జర్మనీ, న్యూజిలాండ్ (9), జపాన్ (11), చిలీ (14), అమెరికా (15), ఇటలీ (19), చెక్ రిపబ్లిక్ (25) జట్లు బరిలో ఉన్నాయి. ఈ టోర్నీలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు నెగ్గిన మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. జనవరి 13 నుంచి 20 వరకు స్పెయిన్‌లోని వాలెన్సియాలో ఎనిమిది జట్ల (బెల్జియం, కెనడా, బ్రిటన్, ఐర్లాండ్, మలేసియా, దక్షిణ కొరియా, స్పెయిన్, ఉక్రెయిన్) మధ్య క్వాలిఫయింగ్-2 టోర్నీ జరుగుతుంది. ఈ టోర్నీ ద్వారా మరో మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందుతాయి.

డబుల్ ధమాకా...





- స్విస్ గ్రాండ్ చెస్ టోర్నీలో విజేతలుగా నిలిచిన వైశాలి, విదిత్
- ఇద్దరూ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత

ఐల్ ఆఫ్ మ్యాన్ (యూకే): అంతర్జాతీయ వేదికపై భారత చెస్ క్రీడాకారులు ఆర్. వైశాలి, విదిత్ సంతోష్ గుజరాతి సత్తా చాటుకున్నారు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో ఐల్ ఆఫ్ మ్యాన్ దీవిలో జరిగిన స్విస్ గ్రాండ్ టోర్నీలో ఓపెన్ విభాగంలో విదిత్ (మహారాష్ట్ర), మహిళల విభాగంలో వైశాలి (తమిళనాడు) చాంపియన్స్‌గా అవతరించారు. ఈ టోర్నీలో టైటిల్ సాధించిన తొలి భారతీయ క్రీడాకారులుగా వీరిద్దరు గుర్తింపు పొందారు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత విదిత్ 8.5 పాయింట్లతో... వైశాలి కూడా 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. విదిత్ ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. వైశాలి ఆరు గేముల్లో నెగ్గి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది. చాంపియన్స్‌గా నిలిచిన విదిత్‌కు ట్రోఫీలతో పాటు 80 వేల డాలర్లు (రూ. 66 లక్షల 57 వేలు), వైశాలికి ట్రోఫీలతో పాటు 25 వేల డాలర్లు (రూ. 20 లక్షల 80 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ టైటిల్స్‌తో ఓపెన్ విభాగంలో విదిత్... మహిళల విభాగంలో వైశాలి క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించారు. ఓపెన్, మహిళల విభాగాల్లో వేర్వేరుగా ఎనిమిది మంది ప్లేయర్ల మధ్య క్యాండిడేట్స్ టోర్నీ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 2 నుంచి 25 వరకు కెనడాలోని టొరంటోలో జరుగుతుంది. క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచిన వారు ఓపెన్ విభాగంలో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో... మహిళల విభాగంలో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం తలపడతారు.

గట్టెక్కిన బంగ్లాదేశ్

- వరుస ఆరు పరాజయాల తర్వాత మరో విజయం
- ప్రపంచకప్‌లో తొలిసారి శ్రీలంకపై గెలుపు
- కెప్టెన్ షకీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- అసలంక సెంచరీ వృథా





న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో అద్భుతం సాధిద్దామనే లక్ష్యంతో భారత గడ్డపై అడుగుపెట్టిన బంగ్లాదేశ్ తొలి మ్యాచ్‌లో గెలిచి శుభారంభం చేసింది. ఆ తర్వాత ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు కాదు.. వరుసగా ఆరు పరాజయాలను చవిచూసి సెమీ ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ ప్రపంచకప్‌లో టాప్-7లో నిలిస్తేనే 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించే అవకాశం ఉండటంతో బంగ్లాదేశ్‌కు ఎనిమిదో మ్యాచ్ కీలకంగా మారింది. మాజీ విశ్వవిజేత శ్రీలంకతో జరిగిన ఈ పోరులో బంగ్లాదేశ్ మూడు వికెట్ల తేడాతో నెగ్గి మళ్లీ గెలుపు బాట పట్టింది. గెలుపుదారిలో వికెట్లను చేజార్చుకోవడం కలవరపెట్టినా... చివరకు బంగ్లాదేశ్ నుంచి విజయం మాత్రం చేజారలేదు. ప్రపంచకప్ చరిత్రలో శ్రీలంకపై బంగ్లాదేశ్‌కిదే తొలి విజయం కావడం విశేషం. 280 పరుగుల లక్ష్య ఛేదనలో నజ్ముల్ హొస్సేన్ షాంతో (101 బంతుల్లో 90; 12 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబుల్ హసన్ (65 బంతుల్లో 82; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) కీలకపాత్ర పోషించారు. చివర్లో తౌహిద్ హ్రిదయ్ (7 బంతుల్లో 15 నాటౌట్; 2 సిక్సర్లు) నిలబడి బంగ్లాదేశ్ విజయాన్ని ఖాయం చేశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 279 పరుగుల వద్ద ఆలౌటైంది. చరిత్ అసలంక (105 బంతుల్లో 108; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీ సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లు తంజీమ్ హసన్ (3/80), షోరిఫుల్ (2/51), షకీబుల్ హసన్ (2/57) సమష్టిగా వికెట్లు పడగొట్టారు. అనంతరం బంగ్లాదేశ్ 41 పరుగులకే ఓపెనర్లు తంజిద్ హసన్ (9), లిటన్ దాస్ (23) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో నజ్ముల్, షకీబ్ అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 169 పరుగులు జోడించారు. 210 వద్ద షకీబ్, మరో పరుగు తర్వాత నజ్ముల్ నిష్క్రమించారు. మహ్మదుల్లా (22), ముష్ఫికర్ (10), మిరాజ్ (3) స్వల్ప వ్యవధిలో అవుటవ్వడంతో బంగ్లాదేశ్‌కు ఇబ్బంది ఎదురైంది. అయితే తౌహిద్, తంజీమ్ జట్టును విజయతీరానికి చేర్చారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (బి) తంజీమ్ 41; పెరీరా (సి) ముష్ఫికర్ (బి) షోరిఫుల్ 4; మెండిస్ (సి) షోరిఫుల్ (బి) షకీబ్ 19; సమరవిక్రమ (సి) మహ్మదుల్లా (బి) షకీబ్ 41; అసలంక (సి) లిటన్ (బి) తంజీమ్ 108; మాథ్యూస్ (టైమ్డ్ అవుట్) 0; ధనంజయ (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) మిరాజ్ 34; తీక్షణ (సి) సబ్-అహ్మద్ (బి) షోరిఫుల్ 21; చమీర (రనౌట్) 4; రజిత (సి) లిటన్ (బి) తంజీమ్ 0; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 279. వికెట్ల పతనం:** 1-5, 2-66, 3-72, 4-135, 5-135, 6-213, 7-258, 8-278, 9-278, 10-279. **బౌలింగ్:** షోరిఫుల్ 9.3-0-51-2, టస్కిన్ 10-1-39-0, తంజీమ్ హసన్ 10-0-80-3, షకీబ్ 10-0-57-2, మిరాజ్ 10-0-49-1.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తంజిద్ (సి) నిసాంక (బి) మదుషంక 9; లిటన్ దాస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మదుషంక 23; నజ్ముల్ (బి) మాథ్యూస్ 90; షకీబ్ (సి) అసలంక (బి) మాథ్యూస్ 82; మహ్మదుల్లా (బి) తీక్షణ 22; ముష్ఫికర్ (బి) మదుషంక 10; తౌహిద్ (నాటౌట్) 15; మిరాజ్ (సి) అసలంక (బి) తీక్షణ 3; తంజీమ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (41.1 ఓవర్లలో 7 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1-17, 2-41, 3-210, 4-211, 5-249, 6-255, 7-269. **బౌలింగ్:** మదుషంక 10-1-69-3, తీక్షణ 9-0-44-2, కసున్ రజిత 4-0-47-0, చమీర 8-0-54-0, మాథ్యూస్ 7.1-1-35-2, ధనంజయ డిసిల్వా 3-0-20-0.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	7	5	2	10	0.924
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	7	4	3	8	-0.330
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	8	2	6	4	-1.160
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
ఇంగ్లండ్	7	1	6	2	-1.504

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే.-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X అఫ్గానిస్తాన్
వేదిక: ముంబై
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

మాథ్యూస్ 'టైమ్డ్ అవుట్'

తొలి క్రికెటర్‌గా గుర్తింపు



శ్రీలంక క్రికెటర్ ఏంజెలో మాథ్యూస్ అనూహ్య, అరుదైన రీతిలో అవుటై క్రికెట్ చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. 146 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌లో 'టైమ్డ్ అవుట్' ద్వారా అవుట్ అయిన తొలి క్రికెటర్‌గా అతను నిలిచాడు. సోమవారం బంగ్లాదేశ్‌తో న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. లంక ఇన్నింగ్స్ 25వ ఓవర్ రెండో బంతికి సమరవిక్రమ అవుటయ్యాడు. నిబంధనల ప్రకారం తర్వాతి బ్యాటర్ 2 నిమిషాల్లోగా బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. క్రీజ్‌లోకి మాథ్యూస్ సరైన సమయానికే వచ్చినా బంతిని ఎదుర్కోవడంలో ఆలస్యం చేశాడు. తన హెల్మెట్‌ను సరి చేసుకుంటుండగా దాని స్ట్రాప్ తెగింది. దాంతో మరో హెల్మెట్ కోసం సైగ చేయగా, చమిక మైదానంలోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు. అప్పటికే సమయం మించిపోవడంతో బౌలర్, బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ 'టైమ్డ్ అవుట్' కోసం అప్పీల్ చేశాడు. దాంతో అప్పీల్‌ను పరిగణనలోకి తీసుకున్న అంపైర్లు చర్చించి నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను 'అవుట్'గా ప్రకటించారు. తన హెల్మెట్ సమస్యను బ్యాటర్ అంపైర్లకు వివరించినా వారు స్పందించలేదు. ఆ తర్వాత అప్పీల్ వెనక్కి తీసుకోమని షకీబ్‌ను కూడా కోరినా అతను ససేమిరా అనడంతో మాథ్యూస్ వెనుదిరగక తప్పలేదు. అనంతరం ఫోర్త్ అంపైర్ ఏడ్రియన్ హోల్డ్‌స్టాక్ దీనిపై మరింత స్పష్టతనిచ్చారు. 'మాథ్యూస్‌కు హెల్మెట్ సమస్య కూడా రెండు నిమిషాల తర్వాత వచ్చింది. అప్పటికీ అతను బంతిని ఎదుర్కోకుండా ఆలస్యం చేశాడు. క్రీజ్‌లోకి వచ్చే ముందు ఎక్విప్‌మెంట్‌లో అన్నింటినీ సరిగ్గా చూసుకోవడం కూడా బ్యాటర్‌దే బాధ్యత' అని ఆయన చెప్పారు. దాంతో షకీబ్ క్రీడా స్ఫూర్తి అంశాన్ని పక్కన పెడితే నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను అవుట్‌గా ప్రకటించడం సరైందే.

వెర్‌స్టాపెన్‌కు 17వ విజయం

బ్రెజిల్ గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం



సావ్‌పాలో (బ్రెజిల్): మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో 17వ విజయాన్ని నమోదు చేశాడు. సీజన్‌లోని 20వ రేసు బ్రెజిల్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన అతను చివరిదాకా తన ఆధిక్యాన్ని కాపాడుకొని విజేతగా నిలిచాడు. వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంట 56 నిమిషాల 48.894 సెకన్లలో రేసును ముగించి టైటిల్ దక్కించుకున్నాడు. మొత్తం 20 మంది డ్రైవర్లలో 14 మంది మాత్రమే రేసును పూర్తి చేశారు. ఈ ఏడాది మొత్తం 22 రేసులు ఉండగా.. ఇప్పటికి 20 రేసులు ముగిశాయి. 17 రేసుల్లో వెర్‌స్టాపెన్ నెగ్గగా... రెండు రేసుల్లో సెర్గియో పెరెజ్ (రెడ్‌బుల్), ఒక రేసులో కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) గెలిచారు. ఈ సీజన్‌లోని తదుపరి రేసు లాస్‌వేగస్ గ్రాండ్‌ప్రి ఈనెల 19న జరుగుతుంది.

ఫైనల్లో స్వియాటెక్



కాన్‌కున్ (మెక్సికో): మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన రెండో సెమీఫైనల్లో స్వియాటెక్ 6-3, 6-2తో ప్రపంచ నంబర్ వన్, గత ఏడాది రన్నరప్ సబలెంకా (బెలారస్)పై గెలిచింది. ఐదో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా)తో జరిగే ఫైనల్లో స్వియాటెక్ గెలిచి విజేతగా నిలిస్తే మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటుంది.

పంజాబ్ ఎట్టకేలకు...

మొహాలి: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్ జట్టు తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. బరోడా జట్టుతో జరిగిన ఫైనల్లో పంజాబ్ 20 పరుగుల తేడాతో గెలిచింది. గతంలో పంజాబ్ నాలుగుసార్లు (2007, 2012, 2013, 2015) పంజాబ్ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 223 పరుగులు సాధించింది. అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (61 బంతుల్లో 113; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు సెంచరీ చేశాడు. అనంతరం బరోడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 203 పరుగులు చేసి ఓడిపోయింది. బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ (4/23) పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

సినిమా

కనిపించడు.. వ్యాపించి ఉంటాడు!



● రవితేజ

''కొండలో లావాని కిందకి పిలవకు.... ఊరు ఉండదు.. నీ ఉనికి ఉండదు'' అంటూ రవితేజ వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ఈగల్' సినిమా టీజర్. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ఇది. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ''ఎక్కడుంటాడు?(అనుపమా పరమేశ్వరన్).. అడవిలో ఉంటాడు.. నీడై తిరుగుతుంటాడు.. కనిపించడు. కానీ వ్యాపించి ఉంటాడు ('అవసరాల' శ్రీనివాస్) వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: దావ్ జాంద్, సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

అనుష్క @ 50



● అనుష్క

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క నటించనున్న తెలుగు చిత్రం ఏంటి? అనే ప్రశ్నకు సోమవారం సమాధానం దొరికింది. నేడు (నవంబర్ 7) అనుష్క పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమె నటించనున్న తాజా సినిమా ప్రకటన వచ్చింది. అనుష్క లీడ్ రోల్‌లో జి.అశోక్ దర్శకత్వంలో 'భాగమతి'ని నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజాగా 'భాగమతి 2'ని ప్రకటించారు. అనుష్క నటించనున్న 50వ చిత్రం ఇది. ఇక 'భాగమతి' చిత్రం 2018 జనవరి 26న విడుదలై, మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు ఆరేళ్లకి 'భాగమతి 2' సినిమా ప్రకటించారు వంశీ, ప్రమోద్. ఈ సినిమాని భారీ స్థాయిలో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ చిత్ర దర్శకుడు, నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. కాగా అనుష్క నటించిన తాజా మలయాళ చిత్రం 'కథనార్' విడుదలకు సిద్ధమవుతోంది.

రంగరాయ శక్తివేల్ నాయకర్.. థగ్‌లైఫ్



● కమల్ హాసన్

'నాయగన్'(1987) చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రానికి 'థగ్ లైఫ్' టైటిల్‌ని ఖరారు చేసి, టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే ఈ చిత్రంలో త్రిష, దుల్కర్ సల్మాన్, 'జయం' రవి కీలక పాత్రలు పోషించనున్నట్లు కూడా వెల్లడించారు. 'రంగరాయ శక్తివేల్ నాయకర్.. నాది కాయల్ పట్టినమ్', 'రంగరాయ శక్తివేల్ నాయకర్ అంటే క్రిమినల్, గూండా, యాకుజా. యాకుజా అంటే జపనీస్‌లో గ్యాంగ్‌స్టర్ అని అర్థం', 'చావు నా కోసం ఎదురుచూడటం ఇదేం తొలిసారి కాదు. చివరిసారి కూడా కాదు', 'నా పేరు రంగరాయ శక్తివేల్ నాయకర్.. మర్చిపోవద్దు' అని కమల్‌హాసన్ చెప్పే డైలాగ్స్ 'థగ్స్ లైఫ్' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో ఉన్నాయి. కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్ మహేంద్రన్, శివ అనంత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నేడు కమల్ బర్త్ డే సందర్భంగా 'థగ్ లైఫ్'కి సంబంధించిన విశేషాలను సోమవారం వెల్లడించారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: రవి కె.చంద్రన్.

నన్ను కొత్తగా చూస్తారు

- రాఘవా లారెన్స్

రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'జిగర్ తండ డబుల్ ఎక్స్'. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చెప్పిన విశేషాలు.



● ఎస్‌జే సూర్య, రాఘవా లారెన్స్

లారెన్స్ మాట్లాడుతూ – ''జిగర్ తండ' సినిమాలోని గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటించే తొలి అవకాశం నాకే వచ్చింది. కానీ అప్పుడు ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల చేయడం కుదర్లేదు. ఆ తర్వాత 'జిగర్ తండ'కు రెండు జాతీయ అవార్డులు వచ్చాయి. దీంతో 'జిగర్ తండ' కు సీక్వెల్ ఉన్నట్లయితే అందులో నేను నటిస్తానని కార్తీక్ సుబ్బరాజుకి చెప్పాను. ఈ సీక్వెల్ 'జిగర్ తండ: డబుల్ ఎక్స్' కథ సిద్ధమైన ఏడాది తర్వాత కార్తీక్ సుబ్బరాజు ఫోన్ చేసి చెప్పారు. కథ నచ్చడంతో ఈ సినిమాలో నటించాను. ● ఈ సినిమా విషయంలో దర్శకుడు కార్తీక్ చెప్పినట్లు చేశాను. ప్రేక్షకులు కొత్త రాఘవా లారెన్స్‌ని చూస్తారు. సినిమా ఫస్టాఫ్‌లో యాక్షన్, సెకండాఫ్‌లో భావోద్వేగాల సన్నివేశాలు ఉంటాయి. ముఖ్యంగా చివరి 20 నిమిషాలు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకుల హృదయం కూడా బరువెక్కుతుంది. ● త్వరలో 'కాంచన 4' స్టార్ట్ చేస్తాను. ఇక సూపర్ స్టార్ రజనీకాంత్‌గారి కోసమే కాదు.. సూపర్ స్టార్, మెగాస్టార్ (చిరంజీవిని ఉద్దేశిస్తూ..) కలిసి యాక్ట్ చేసే ఓ మల్టీస్టారర్ స్క్రిప్ట్ నా దగ్గర ఉంది. కానీ వారు యాక్ట్ చేయాలి కదా'' అన్నారు.

నటుడు- దర్శకుడు ఎస్‌జే సూర్య మాట్లాడుతూ- ''దర్శకత్వం-నటన..ఈ రెండింటిలో నాకు నటన అంటేనే ఇష్టం. అయితే నా కెరీర్ ప్రారంభంలో యాక్టింగ్ అవకాశాల కోసం డైరెక్షన్‌ని వారధిగా వినియోగించుకున్నాను. ఇక 'జిగర్ తండ: డబుల్‌ఎక్స్'లో లారెన్స్‌గారిది గ్యాంగ్‌స్టర్ రోల్. నాదేమో దర్శకుడు కావాలనుకునే పాత్ర. నా పాత్రలో సత్యజిత్ రేగారి సినిమాల రిఫరెన్స్ ఉండటంతో ఇదొక బహుమతిగా భావించి ఈ మూవీ చేశాను. మంచి మాస్ కమర్షియల్ అంశాలు ఉన్న సందేశాత్మక చిత్రం ఇది. ఈ సినిమా షూటింగ్ కోసం ఓ విలేజ్ సెట్ వేయాల్సి వచ్చింది. ఇందులో భాగంగా ఓ రోడ్, బ్రిడ్జ్ వేశాం. అప్పటికే రోడ్, బ్రిడ్జ్ సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్న ఆ గ్రామస్తులకు ఇవి ఇప్పుడు ఉపయోగపడుతున్నాయి. నేను నటిస్తూ, నా దర్శకత్వంలో ఓ సినిమా రానుంది'' అని చెప్పుకొచ్చారు.



● బన్నీ వాసు, తేజా మార్ని, అల్లు అరవింద్, అనిల్ రావిపూడి, శివానీ, రాహుల్ విజయ్, విద్య

ఈ కథ చాలా సంతృప్తినిచ్చింది

- నిర్మాత అల్లు అరవింద్

రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత అల్లు అరవింద్ అతిథులుగా హాజరయ్యారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ- ''పోలీసులను రాజకీయ నాయకులు ఏ విధంగా వాడుకున్నారనే అంశంపై ఈ సినిమా ఉంటుంది. చాలా సంతృప్తినిచ్చిన కథ ఇది. పోలీసులు పడే బాధలు, ఇబ్బందులు ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు. ''ఈ సినిమా ఒరిజినల్ (మలయాళ చిత్రం 'నాయట్టు') చూశాను. 'కోట బొమ్మాళి'లో చాలా మార్పులు చేశారు. టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. ఇప్పుడు నిర్మాతగా వస్తున్న విద్యాగారు సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు అనిల్ రావిపూడి. ''తేజా మార్ని డైరెక్షన్, కాశీ నాగేంద్ర డైలాగ్స్ ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయి. సిటీల్లో జరిగే ఎన్నికల గురించి నాకు పెద్దగా తెలియదు. ఊర్లలో ఉన్న, అక్కడి ఎలక్షన్స్‌లో పాల్గొంటున్న వారికి ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు గట్టిగా తగుల్తాయి. కొంతమంది రాజకీయ నాయకులకు కూడా తగలొచ్చు. ఏ పార్టీకీ కొమ్ము కాసేలా ఈ సినిమా ఉండదు'' అన్నారు 'బన్నీ' వాసు. ''నేరస్తులను పట్టుకోవాల్సిన పోలీసులే ఓ కేసులో ఇరుక్కుని ఎలా అవస్థలు పడ్డారనేది ఈ సినిమా కాన్సెప్ట్'' అన్నారు తేజా మార్ని. ''ఈ సినిమా కోసం అందరూ చాలా కష్టపడ్డారు'' అన్నారు విద్యా. ఈ కార్యక్రమంలో చిత్ర కో ప్రొడ్యూసర్స్ భాను-రియాజ్, రైటర్ కాశీ నాగేంద్ర, ఆర్ట్ డైరెక్టర్ గాంధీ, నిర్మాతలు ధీరజ్, వంశీ నందిపాటి, ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.



● గౌరీకృష్ణ

ఈ విజయం కొత్తగా ఉంది

- నిర్మాత గౌరీకృష్ణ

''నేను గతంలో పలు సినిమాలు నిర్మించినా అనుకున్నంత విజయం సాధించలేదు. 'మా ఊరి పొలిమేర 2' చిత్రంతో తొలి హిట్ అందుకున్నా.. ఈ విజయం చాలా కొత్తగా ఉంది. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని నిర్మాత గౌరీకృష్ణ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల జంటగా డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా గౌరీకృష్ణ మాట్లాడుతూ- ''మా ఊరి పొలిమేర' తొలి భాగం విజయం సాధించిందని సీక్వెల్ తీయలేదు. అనిల్ విశ్వనాథ్‌పై నమ్మకంతోనే 'మా ఊరి పొలిమేర 2' తీశాం. గీతా ఆర్ట్స్ సంస్థకు చెందిన వంశీ నందిపాటిగారు విడుదల చేయడం వల్ల సినిమాకు ప్లస్ అయ్యింది. నిర్మాతగా నా తర్వాతి చిత్రానికి కథా చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

అన్నదమ్ముల అనుబంధం



● సంపూర్ణేష్ బాబు, సంజోష్

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీ బన్సాల్, ఆర్తీ గుప్తా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వం వహించారు. చంద్ర చంగల్ల నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత వివేక్ కూచిభొట్ల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ- ''అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో వినోదాత్మకంగా 'సోదరా'ను రూపొందించాం. ఇటీవలే విడుదలైన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమాని త్వరలోనే విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: జాన్.

ఇది మనందరి కథ

- దర్శకుడు మారేష్ శివన్

''ప్రేమ, లక్ష్యం.. ఈ రెండింటినీ ఒకేసారి ఎంచుకోవాల్సి వస్తే ఏం చేస్తారు? ఏం చేయాలి? అనే సందేశంతో 'అలా నిన్ను చేరి' సినిమా తీశా. ప్రతి మనిషిలో జరిగే కథ ఇది. యువతరంతో పాటు కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం ఇది. మా చిత్రాన్ని చూసిన తర్వాత కొంత మందైనా మారతారనే నమ్మకం ఉంది'' అని దర్శకుడు మారేష్ శివన్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. మారేష్ శివన్ విలేకరులతో మాట్లాడుతూ-''ఈ చిత్ర కథ 2012 నేపథ్యంలో జరుగుతుంది. 2012లో రాసుకున్న కథే అయినా ఇందులోని ప్రేమ, భావోద్వేగాలు ఇప్పటి వారికి కూడా నచ్చుతాయి. సుభాష్ ఆనంద్ సంగీతం ఓ ప్లస్. ఈ సినిమా ప్రీమియర్ చూసిన డైరెక్టర్ త్రినాథరావు, నిర్మాతలు బెక్కెం వేణుగోపాల్, బెల్లంకొండ సురేష్‌వంటి వారు మంచి సినిమా తీశానని అభినందించారు. ప్రేక్షకులు థియేటర్స్ నుంచి అదే భావోద్వేగంతో బయటికొస్తారు'' అన్నారు.

